
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
కృష్ణా జిల్లా వార్తలు
సోమవారం 1 జూలై 2024





విస్తారంగా..

ఉమ్మడి కృష్ణాజిల్లాలో వర్షాలు

- కృష్ణాజిల్లాలో 37.4 మి.మీ
- ఎన్టీఆర్ జిల్లాలో 44.81 మి.మీ వర్షపాతం నమోదు
- సాగు పనుల్లో నిమగ్నమైన రైతులు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. శనివారం రాత్రి నుంచి ప్రారంభమైన వర్షం ఆదివారం సాయంత్రం వరకు కురుస్తూనే ఉంది. వాతావరణం మేఘావృతమై ఉంది. రుతుపవనాలు వచ్చాక ఈ స్థాయిలో వర్షాలు కురవడం ఇదే ప్రథమం. రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. ఈనెల 4వ తేదీ వరకు కోస్తాతీరం వెంబడి ఉరుములు, మెరుపులతో కూడిన ఒక మోస్తరు వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ ఆదివారం హెచ్చరికలు జారీ చేసింది.

మచిలీపట్నం : జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఆదివారం ఒక మోస్తరు నుంచి భారీవర్షం కురిసింది. ఆదివారం ఉదయం 8.30 గంటలకు కృత్తివెన్ను మండలంలో అత్యధికంగా 72.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా పెడనలో 17.8 మిల్లీమీటర్లు, జిల్లాసగటు వర్షపాతం 37.4 మిల్లీమీటర్లుగా నమోదైంది. వాతావరణం వ్యవసాయానికి అనుకూలంగా మారుతుండటంతో రైతులు వ్యవసాయపనుల్లో నిమగ్నమవుతున్నారు.

వరి పైరుకు మేలు

కృష్ణాజిల్లాలోని కంకిపాడు, గన్నవరం, పామర్రు, తోట్లవల్లూరు, మొవ్వ, చల్లపల్లి తదితర మండలాల్లో రైతులు బోరునీటి ఆధారంగా 16వేల హెక్టార్లలో వెదజల్లే పద్ధతిన వరివిత్తనాలు చల్లారు. ఇప్పటికే 1700 హెక్టార్లలో వరి నారుమళ్లు పోయగా వర్షాధారంగా చేసుకుని మరిన్ని ప్రాంతాల్లో మెట్ట నారుమళ్లు పోసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు.

జిల్లాలో వర్షపాతం ఇలా

నందివాడలో 57.4మిల్లీమీటర్లు, బంటుమిల్లిలో 54.2, పెదపారుపూడిలో 53.2, గుడివాడలో 48.2, పామర్రులో 46.2, నాగాయలంకలో 44.8, గుడ్లవల్లేరులో 44.8, ఉయ్యూరులో 43.4, ఉంగుటూరులో 42.6 ఘంటసాలలో 41.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పమిడిముక్కలలో 38.6, చల్లపల్లిలో 34.6, తోట్లవల్లూరులో 33.4, పెనమలూరులో 32.2, కంకిపాడులో 28.2, అవనిగడ్డలో 26.8, గన్నవరంలో 26.4, కోడూరులో 21.6,మచిలీపట్నంలో 21.6, మోపిదేవిలో 20.1, బాపులపాడులో 19.6, మొవ్వలో 18.8, గూడూరులో 18.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఎన్టీఆర్ జిల్లాలో 44.81 మిల్లీమీటర్ల వర్షపాతం

విజయవాడ : ఎన్టీఆర్ జిల్లాలోని ఇతర మండలాల్లో ఎలాంటి వర్షపు ఛాయలు కనిపించలేదు. ఆదివారం మధ్యాహ్నం వరకు చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. మధ్యాహ్నం నుంచి మాత్రం వర్షం తెరపిచ్చింది. జిల్లాలో మొత్తం 44.81 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా తిరువూరు మండలంలో 69.47 మి.మీ వర్షం కురిసింది. విజయవాడ నగరంలో ఏకధాటిగా వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. ఈదుదు గాలులు లేకపోవడంతో ఎలాంటి ఆస్తినష్టం జరగలేదు. జగ్గయ్యపేటలో మాత్రం విద్యుత్ స్తంభాలు ఒక వైపునకు ఒరిగాయి. ఎలాంటి ప్రమాదం జరగకుండా విద్యుత్ శాఖ సిబ్బందిని వాటిని వెంటనే సరిచేశారు. విజయవాడలో ఎన్టీఆర్ సర్కిల్, కబేళా, సితార సెంటర్, ఆంజనేయవాగు, పెజ్జోనిపేట ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది.

ఊపిరిపీల్చుకున్న మెట్ట రైతు

సాగుకు సమయం ఆసన్నమైనా నీటిని విడుదల చేయలేని పరిస్థితి జిల్లాలో కనిపిస్తోంది. అటు డెల్టాలోనూ, ఇటు మైదాన ప్రాంతంలోనూ ఇదే పరిస్థితి ఉంది. అడపాదడపా కురిసిన చినుకుల ప్రభావంతోనే చాలామంది రైతులు పొలాల్లో నాట్లు వేశారు. ఈ ప్రాంతంలో సాగునీటి సదుపాయాలు తక్కువగా ఉండడంతో రైతులు వర్షంపైనే పూర్తిగా ఆధారపడతారు. మొన్నటి వరకు ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవకపోవడంతో చాలా వరకు పంటలు నష్టపోయాయి. ఈసారి వర్షాలు అంతంత మాత్రంగానే కురవడంతో రైతులు బెంగపడ్డారు. తాజాగా కురిసిన వర్షాల ప్రభావం మెట్టలోనూ పడింది. విస్తారంగా కురుస్తున్న వర్షాలతో రైతుల్లో సంతోషం కనిపిస్తోంది.

ఇదిగో భరోసా!



పెరిగిన పింఛనుతో కలిపి నేడు, రేపు లబ్ధిదారులకు పంపిణీ

- జిల్లాలో 2.42,856 సామాజిక పింఛన్లు
- ఒకేసారి రూ.7వేలు అందుకోనున్న లబ్ధిదారులు
- రూ.162.42 కోట్లు పంపిణీకి ఏర్పాట్లు
- రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశాలు

నూతన ప్రభుత్వంలో సోమవారం తొలి సంక్షేమం అందనుంది. అత్యంత కీలకమైన హామీల్లో ఒకటిగా ఉన్న పింఛన్.. పెరిగిన దాంతో కలిపి సోమ, మంగళవారాల్లో లబ్ధిదారులకు దక్కనుంది. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా జిల్లాలో 2,42,856 మందికి సామాజిక పింఛన్లు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందుకోసం రూ.162.42 కోట్లు సిద్ధం చేశారు. నూతన ప్రభుత్వంలో ఒకేసారి రూ.7వేలు పింఛను అందుకునేందుకు లబ్ధిదారులు తహతహలాడుతున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా సామాజిక పింఛను నెలకు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచారు. దివ్యాంగుల పింఛను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచారు. పింఛను నగదును పెంపుదల చేస్తూ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం అనంతరం తొలి సంతకం చేశారు. గత నెల 13వ తేదీన పింఛను సొమ్మును పెంచుతూ ప్రభుత్వం జీవోఎంఎస్ నెంబరు 43ను జారీ చేసింది. నేటి ఉదయం ఆరు గంటల నుంచి పింఛను నగదును సచివాలయ సిబ్బంది ద్వారా లబ్ధిదారులకు అందించనున్నారు. ఇప్పటికే బ్యాంకుల నుంచి నగదును డ్రాచేసి సచివాలయ ఉద్యోగులకు అప్పగించారు. పింఛను పంపిణీకి సంబంధించి ధ్రువీకరణ పత్రాలు, ముఖ్యమంత్రి లేఖను, పింఛను నగదును లబ్ధిదారులకు అందించనున్నారు. జూలై పింఛను రూ.4వేలు, ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి పెంచిన వెయ్యి రూపాయలను కలిపి ఒక్కో లబ్ధిదారుడికి రూ.7వేలు అందించనున్నారు.

జిల్లాలో 2,42,856 మందికి..

జిల్లాలో మొత్తం 2,42,856 మందికి సామాజిక పింఛన్లు అందించనున్నారు. రూ.162.42 కోట్లు అందించనున్నారు.

- దివ్యాంగులు 34,355 మంది ఉన్నారు. వీరికి నెలకు రూ.6వేలు ఇవ్వనున్నారు.
- కిడ్నీ బాధితులకు, ఇతరత్రా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి ఇప్పటివరకు నెలకు రూ.5వేల పింఛను అందించగా, కూటమి ప్రభుత్వం ఈ తరహా ఇబ్బందులు పడుతున్న వారికి నెలకు రూ.10వేలు అందించనుంది.
- జిల్లాలో అభయహస్తం పింఛను పొందేవారు 7,300 మంది, వృద్ధాప్య పింఛను పొందేవారు 1,17,308 మంది ఉన్నారు. కళాకారుల పింఛన్లు 129 ఉన్నాయి. పింఛను పొందే ఒంటరి మహిళలు 781 మంది, తాడి కార్మికులు 3,275 మంది, చేతివృత్తులవారు 4,67 మంది, చేనేత కార్మికులు 4,001 మంది ఉన్నారు. వితంతువులు 59,349 మంది, డప్పు కళాకారులు 878 మంది, మత్స్యకారులు 6,233 మంది ఉన్నారు. దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు మినహా వివిధ రకాల సామాజిక పింఛన్లు పొందేవారంతా కలిపి 1,99,483 మంది ఉన్నారు. వీరికి నెలకు రూ.4వేలు చొప్పున రూ.79.99 కోట్లను అందజేయాల్సి ఉంది.
- పక్షవాతం బారిన పడి లేవలేని స్థితిలో ఉండి మంచానికే పరిమితమైన వారికి గతంలో నెలకు రూ.5వేలను పింఛను ఇచ్చేవారు. ఇక నుంచి ఈ మొత్తాన్ని రూ.15 వేలకు పెంచారు. కిడ్నీవ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకునే వారికి గతంలో నెలకు రూ.5 వేలు పింఛను అందించేవారు. ప్రస్తుతం ఈ మొత్తాన్ని నెలకు రూ.10వేలకు పెంచారు. సికిల్‌సెల్, తలసేమియా తదితర వ్యాధులతో బాధపడేవారికి గతంలో మాదిరిగానే నెలకు రూ.10వేలను పింఛను అందజేయనున్నారు. మొత్తంగా జిల్లాలో పింఛన్ల రూపంలో గతంలో కంటే నెలకు రూ.30 కోట్ల అదనంగా చెల్లించాల్సి ఉంటుందని డీఆర్‌డీఏ అధికారులు చెబుతున్నారు.

ఎట్టకేలకు సీమా పర్వీన్‌కు పింఛన్

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం ఫతుల్లాబాద్‌కు చెందిన నడవలేని దివ్యాంగురాలికి ఎట్టకేలకు అధికారులు పింఛను మంజూరు చేశారు. సోమవారం సీమా పర్వీన్‌కు మంత్రి కొల్లు రవీంద్ర చేతుల మీదుగా పింఛను అందించనున్నారు. చంద్రబాబు రెండేళ్ల క్రితం మచిలీపట్నం వచ్చినప్పుడు మంచానికే పరిమితమైన దివ్యాంగురాలు సీమా పర్వీన్‌కు పింఛను అందడం లేదని 27వ డివిజన్ కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము చంద్రబాబుకు తెలిపారు.



బందరు వచ్చినప్పుడు సీమా పర్వీన్‌కు చెక్కు అందించి చంద్రబాబు సెల్ఫీ

చిత్తజల్లు నాగరాము ఏడాదికి తన సొమ్మును పింఛను రూపంలో రూ.30 వేలు చంద్రబాబు ద్వారా అందజేశారు. కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ రూ.10వేలు అందజేశారు. అప్పటి నుంచి సీమా పర్వీన్‌కు కార్పొరేటర్ ప్రతినెలా రూ.3వేల పింఛను అందిస్తున్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే దివ్యాంగురాలికి పింఛను ఇప్పిస్తానని నాటి సభలో వాగ్దానం చేశారు. ఆ మేరకు సీమా పర్వీన్‌కు పింఛను మంజూరైంది.

19 నుంచి దుర్గగుడిలో శాకంబరి ఉత్సవాలు

4లో..

- మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తాం: ఈవో రామారావు

ప్రభుత్వం మారినా ఉదాశీనతే!

అంబాపురంలో వంశీ అనుచరులు కబ్జా చేసిన భూముల స్వాధీనానికి అధికారుల వెనకడుగు

- స్థలాలు స్వాధీనం చేసుకోవాలని స్థానికుల డిమాండ్

4లో..

దుర్గమ్మ సన్నిధిలో 'పల్లా'

గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మవారిని ఆదివారం దర్శించుకున్నారు. ఈవో కేఎస్ రామారావు ఆయనకు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు వేదాశీర్వచనమిచ్చారు. ఆయనకు ఈవో అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.



ఉద్యోగులకు అశాంతి!

వైసీపీ ప్రభుత్వ హయాంలో దేవదాయశాఖలో వేళ్లూనుకున్న అవినీతి కలుపు మొక్కలను ప్రక్షాళన చేసేందుకు రంగం సిద్ధమవుతోంది. వైసీపీ కీలక నేత విజయసాయి రెడ్డి ఆశీస్సులతో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల దేవదాయశాఖ పగ్గాలు చేపట్టి పెత్తనం చెలాయిస్తున్న అధికారిణిని బదిలీ చేసేందుకు ఉన్నతాధికారులు సమాయత్తమయ్యారు. రెండు జిల్లాల్లో విధులు నిర్వహించే దేవదాయ ఉద్యోగులను నిత్యం విధులకు హాజరవ్వగానే ఫొటోలు తీసి తనకు వాట్సాప్ చేయాలని ఈ అధికారిణి హుకుం జారీ చేయడం, తనకు అనుకూలురైన ఉద్యోగులకు మాత్రం ఈ వాట్సాప్ అటెండెన్స్ నుంచి మినహాయింపు ఇవ్వడం... ఉద్యోగులపై బూతు పురాణంతో రెచ్చిపోవడం లాంటి వాటితో చెడ్డపేరు మూటగట్టుకున్న ఆ అధికారిణి అక్రమాలపై ప్రత్యేక కథనం..

దేవదాయశాఖ అధికారిణి తీరుపై ఉద్యోగుల గగ్గోలు



- నిత్యం వాట్సాప్ అటెండెన్స్ పేరుతో వేధింపులు
- చెప్పినట్టు వినని ఉద్యోగులపై బూతులతో దాడి
- సహ ఉద్యోగులను ఏజెంట్లుగా పెట్టి అక్రమాలు
- ఉయ్యూరుకు చెందిన ఈవో.. మరో గుమస్తా విధులకు డుమ్మా కొట్టి అధికారిణితో కలిసి చెట్టపట్టాల్
- ఏసీబీకి ఉద్యోగుల నుంచి ఫిర్యాదుల వెల్లువ

త్వరలో బదిలీకి రంగం సిద్ధం

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : దేవదాయశాఖ సిబ్బందిని ఇష్టారాజ్యంగా దూషిస్తారని ఈ అధికారిణికి పేరు. 'మీకు మీ తల్లిదండ్రులు చనిపోతే ఉద్యోగాలు వచ్చాయి. మీకు చదువు లేదు. అందుకే పనులు రావు' అంటూ అవమానిస్తున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. ఓ ఈవోను తన కార్యాలయంలో ఏసీ పనిచేయడం లేదని కొత్తది కొనుగోలు చేసి పంపాలని ఈమె ఆదేశించారు. ఆ ఈవో కొత్త ఏసీ కొనుగోలులో కొన్ని రోజులు జాప్యం చేయడంతో అతని పిలిచి అందరి ముందే బూతులు తిట్టి ఎందుకూ చేతకాని వాడివంటూ దూషించారు.

విజయసాయిరెడ్డి అండతో...

జిల్లాలో దేవదాయశాఖ అధికారిణిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వైసీపీ ఎమ్మెల్యేలను సైతం లెక్క చేయలేదు. జిల్లాకు వచ్చిన తొలిరోజుల్లో తిరువూరు నియోజకవర్గంలోని ఓ ఆలయం ఈవోగా బాధ్యతలు చేపట్టిన ఈమెతో స్థానిక ఎమ్మెల్యేగా ఉన్న రక్షణనిధిని కలిసేందుకు వెళదామని తోటి ఉద్యోగులు సూచించారు. ఎమ్మెల్యేనా ఆయన ఎవరు అంటూ ఈమె వ్యాఖ్యానించడంతో వారు అవాక్కయ్యారు. మచిలీపట్నం ఎమ్మెల్యేగా పేర్ని నాని ఉన్న సమయంలో ఈమె తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణతో సమీక్ష సమావేశంలోనే ఈ అధికారిణి తీరుపై ఫిర్యాదు చేసి, ఆమెను జిల్లా నుంచి పంపించి వేయాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. అది తన చేతుల్లో లేదని, సాయిరెడ్డికి చెప్పాలని పేర్నికి సూచించడం గమనార్హం. ఆ తర్వాత సాయిరెడ్డి సూచనలతో ఈమె పేర్నిని కలిసి ప్రసన్నం చేసుకున్నారని చెబుతారు. విశాఖపట్నంలో పనిచేసే సమయంలో వైసీపీ నాయకుడు విజయసాయి రెడ్డి భూకబ్జాలకు ఈమె తన వంతు సహకారం అందించారని దేవదాయశాఖ ఉద్యోగులే చెబుతుంటారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని దేవదాయ భూములకు సంబంధించిన మొత్తం వివరాలను జిరాక్స్ తీసి మరీ సాయిరెడ్డికి అప్పగించారన్న ఆరోపణలు ఉన్నాయి. వాటి ఆధారంగా విశాఖలో సాయిరెడ్డి కబ్జా పర్వం సాగిందని చెబుతారు.

వసూళ్లకు ఏజెంట్లు..

రెండు జిల్లాల్లో వసూళ్ల కోసం ఈ అధికారిణి ప్రత్యేకంగా కొందరు దేవదాయశాఖ ఉద్యోగులను నియమించుకోవడం గమనార్హం. ఉయ్యూరులో ఈవోగా విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి అక్కడ కన్నా ఈ అధికారిణి వెంటే ఎక్కువ కనిపిస్తుంటారు. ముదినేపల్లి మండలం వడాలిలో గుమస్తాగా విధులు నిర్వహించాల్సిన ఉద్యోగి అక్కడ విధులు నిర్వహించకుండా ఈ అధికారిణి వెంటే తిరుగుతుంటారు. ఎన్‌వోసీలు జారీ చేసే సమయంలో డబ్బులు దండుకోవడం.. ఆలయాల ఇన్‌స్పెక్షన్ సమయంలో డబ్బులు వసూలు చేయడం వంటివి వీరు చేస్తుంటారు. కొద్ది రోజుల క్రితం ఉయ్యూరుకు వెళ్లిన ఈ అధికారిణి తనిఖీల పేరుతో హడావిడి చేసి ఓ మహిళా ఉద్యోగి నుంచి లక్ష రూపాయలు వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. సదరు మహిళా ఉద్యోగి తన నగలు తాకట్టు పెట్టి మరీ ఆ మొత్తాన్ని ఈ అధికారిణి వెంట తిరిగే గుమస్తాకు సమర్పించుకోవడం గమనార్హం.

ఏసీబీకి ఫిర్యాదుల వెల్లువ

ఈ అధికారిణి తీరుతో విసుగెత్తిపోయిన కొందరు ఉద్యోగులు ఇటీవల ప్రభుత్వం మారగానే ఏసీబీ అధికారులకు ఫిర్యాదులు చేయడం ప్రారంభించారు. కేవలం 20 రోజుల వ్యవధిలోనే ఈ అధికారిణిపై 10కి పైగా ఫిర్యాదులు వెల్లాయి. విశాఖపట్నంలో పనిచేసే సమయంలో ఉద్యోగులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లోనే.. తనకు పెళ్లి సమయంలో తల్లిదండ్రులు 100 కాసుల బంగారం పెట్టారని, భర్త మరికొన్ని నగలు చేయించారని, పిల్లలు పుట్టాక మరింత బంగారం పెట్టారని తాను ఆ వివరాలన్నీ ప్రభుత్వానికి నివేదించానని ఈ అధికారిణి చెప్పుకొచ్చారు. సాధారణ దిగువ మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన అధికారిణి ఉద్యోగంలో చేరి పట్టుమని 10 సంవత్సరాలు కూడా కాకముందే వందల కోట్ల ఆస్తిని ఎలా ఆర్జించారన్నది ప్రశ్న. ఈ అధికారిణి ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రతి ఏటా సమర్పించిన సెల్ఫ్ డిక్లరేషన్లను.. ఆమె వాస్తవ ఆస్తులను పరిశీలిస్తే ఈమె అక్రమార్జన గుట్టు రట్టవుతుందని దేవదాయశాఖ ఉద్యోగులు పేర్కొంటున్నారు.

టీడీపీ నేతల ప్రాపకం కోసం ప్రయత్నాలు

విశాఖలో పనిచేసిన సమయంలో ఈమెపై సహోద్యోగే అవినీతి ఆరోపణలు చేశారు. నర్సీపట్నం దుర్గామల్లేశ్వర ఆలయ ఈవో శర్మ.. తాను ఈ అధికారిణికి రూ.8.5 లక్షలు ఇచ్చానని ఏకంగా మీడియా ఎదుటే ఆరోపణలు చేయడం గమనార్హం. ఆ డబ్బులు తీసుకుని మూడు రోజులు తిరక్కముందే మళ్లీ రూ.50వేలు కావాలని కబురు పెట్టారని ఆయన అప్పట్లో ఆరోపించారు. నిన్నటి వరకు విజయసాయి రెడ్డి అండ చూసుకుని చెలరేగిపోయిన ఈమె ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో టీడీపీ నేతల ప్రాపకం కోసం పాకులాడుతూ ఎన్టీఆర్ లేదా కృష్ణా జిల్లాలోనే కొనసాగేలా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇలాంటి అధికారిణి రెండు జిల్లాల్లో కొనసాగించవద్దని దేవదాయశాఖ ఉద్యోగులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

కిడ్నీవ్యాధితో మహిళ మృతి

- కిడ్నీ సమస్యను గతంలో జనసేన అధినేతకు వివరించిన మహిళ



లాకావతు నాగమ్మ (ఫైల్)

ఎ.కొండూరు, జూన్ 30 : మండలంలోని రేపూడి తండాకు చెందిన లాకావతు నాగమ్మ(49) కిడ్నీ వ్యాధితో, విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతు ఆదివారం మృతి చెందింది. నాగమ్మ కొంత కాలంగా కిడ్నీవ్యాధికి గురై వైద్యుల సలహా మేరకు చికిత్స పొందుతోంది. వ్యాధి తీవ్రత పెరగడంతో ఆమెను విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలో చేర్చారు. క్రియేటిన్ శాతం ఒక్కసారిగా పెరగడంతో, ఆమె మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. గతంలో విజయవాడలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో మండలంలోనే కిడ్నీవ్యాధి తీవ్రతతో గిరిజనులు పడుతున్న బాధలను జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు ఆమె స్వయంగా వివరించారు. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం తరుపున రూ.10 వేలు, తిరువూరు మాజీ ఏఎంసీ చైర్మన్ ఆలవాల రమేష్ రెడ్డి రూ.20 వేలు జనసేన ఇన్‌చార్జి మనుబోలు శ్రీనివాస రావు, అధికారులు బాధిత కుంటుంబానికి అందించారు.



మంత్రి కొల్లు రవీంద్రతో సినీ దర్శకుడు మారుతి

సినీ పరిశ్రమకు ఊతమిస్తాం

▸▸ దర్శకుడు మారుతితో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూన్ 30: టీడీపీ కూటమి ప్రభుత్వంలో సినీ పరిశ్రమకు ఊతమిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. ఆదివారం కొల్లు రవీంద్ర కార్యాలయానికి వచ్చిన సినీ దర్శకుడు, మచిలీపట్నం నివాసి మారుతితో మంత్రి కొల్లు రవీంద్ర చలనచిత్ర పరిశ్రమ సమస్యలపై మాట్లాడారు. ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ సినీ రంగానికి చెందిన వారవడంతో చలన చిత్ర రంగంలోని సాధకబాధకాలు ఆయనకు తెలుసన్నారు. చలనచిత్ర రంగంలోని పేద కళాకారులను ఆదుకుంటామన్నారు. సినీ షూటింగ్‌లకు రాష్ట్రంలో అనువైన స్థలాలను ఎంపిక చేయాల్సిన అవసరం ఉందని మారుతి అన్నారు. మారుతిని కొల్లు రవీంద్ర సత్కరించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, టీడీపీ నగర కార్యదర్శి పిప్పళ్ల కాంతారావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న అర్చకులు

ఈనాం భూములకు భూమి శిస్తు రశీదులివ్వాలి

అవనిగడ్డ, జూన్ 30: రాష్ట్రంలో దేవదాయ శాఖ పరిధిలో, దేవాలయాల అర్చకుల ఆధీనంలో ఉన్న ఆలయ భూములకు(సర్వీస్ ఈనాం) అర్చకుల పేరునే భూమి శిస్తు రశీదులు జారీ చేయాలని రాష్ట్ర అర్చక సమాఖ్య ప్రతినిధులు దీవి రామకృష్ణమాచార్యులు(బార్లపూడి), వాసుదేవ సీతారామకృష్ణ, కుమార ఆచార్యులు (హంసలదీవి), బాలకృష్ణ ఆచార్యులు, లక్ష్మీ దాశరథి, బృందావనం అనంత రామాచార్యుల బృందం ఆదివారం అవనిగడ్డ నుంచి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ద్వారా దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి వినతిపత్రాన్ని పంపింది. అనుభవదారులైన అర్చకులకు భూమి శిస్తు రశీదులు ఇవ్వొద్దని గత ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని, దీంతో ఆలయ భూములపై ఉన్న హక్కులను అర్చకులు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనుభవదారులుగా అర్చకుల పేరిట పట్టాదారు పాస్ పుస్తకాలివ్వాలని వారు అభ్యర్థించారు.



భట్టి విక్రమార్కకు తిరుపతమ్మ చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ అధికారులు

తిరుపతమ్మ సేవలో తెలంగాణ డిప్యూటీ సీఎం

పెనుగంచిప్రోలు, జూన్ 30: తెలంగాణ రాష్ట్రంలోని మధిరకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం తిరుపతమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. భట్టి విక్రమార్కను దేవస్థానం ఆలయ డిప్యూటీ కలెక్టర్ కె.రమేష్‌నాయుడు, టీడీపీ నియోజకవర్గ ప్రముఖుడు, తిరుపతమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ నూతలపాటి చెన్నకేశవరావు కలిశారు. అమ్మవారి ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. నియోజకవర్గ జనసేన నాయకుడు లగడపాటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న కృష్ణా ఎన్నికల పరిశీలకుడు ప్రవీణ్‌చౌహాన్

మోపిదేవి, జూన్ 30: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో స్వామిని కృష్ణా జిల్లా ఎన్నికల పరిశీలకుడు ప్రవీణ్‌చౌహాన్ మోహన్‌దాస్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి, స్వామికి విశేష పూజలు చేశారు. అర్చక బృందం శేషవస్త్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. ఆర్ఐ సునీల్‌కుమార్, వీఆర్వో మూర్తి ఆయన వెంట ఉన్నారు.

పామర్రు-అవనిగడ్డ ప్రధాన రహదారిపై కూలిన వృక్షం

పామర్రు, జూన్ 30: పామర్రు-అవనిగడ్డ ప్రధాన రహదారిపై పామర్రు-రావర్ల అడ్డరోడ్డు సమీపంలోని శ్యామలపురం వద్ద ఆదివారం ఉదయం రోడ్డు పక్కన ఉన్న ఓమహా వృక్షం నేలకొరిగింది. దీంతో గంటల కొద్దీ వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎస్సై పి.ప్రవీణ్‌కుమార్ రెడ్డి సిబ్బందితో వెళ్లి వాహనాలను వేరే గ్రామాలమీదగా మళ్లించారు. కూలిన వృక్షాన్ని యంత్ర పరికరాలతో తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. వర్షానికి డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక పామర్రులో బస్టాండ్, తహసీల్దార్ కార్యాలయం, ఫైర్‌స్టేషన్ ప్రాంగణాలు వర్షపునీటితో నిండిపోయాయి.



యంత్రంతో చెట్టును తొలగిస్తున్న పోలీసులు

వెంకయ్యనాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు

పెనమలూరు, జూన్ 30: మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుకు 75వ జన్మదినం సందర్భంగా పెదపులిపాకకు చెందిన బీజేపీ, జనసంఘ్ రాష్ట్ర నాయకుడు వల్లూరి శ్రీమన్నారాయణ తదితరులు హైదరాబాద్‌లోని అన్వయ కన్వెన్షన్ సెంటరులో నిర్వహించిన కార్యక్రమంలో శుభాకాంక్షలు తెలిపారు. వెంకయ్యనాయుడును దుశ్శాలువతో సత్కరించారు. వెంకయ్యనాయుడుకు ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని బహూకరించారు. కుక్కపల్లి నాగేశ్వరరావు, పొట్టి శ్రీహరి, విస్సంశెట్టి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.




వెంకయ్యనాయుడుకు శివాజీ విగ్రహాన్ని అందిస్తున్న వల్లూరి శ్రీమన్నారాయణ



పదవీ విరమణ చేసిన టీపీవో పద్మావతితో పూర్వ మునిసిపల్ కమిషనర్ డాక్టర్ ప్రకాశరావు, సిబ్బంది

పదవీ విరమణ చేసిన మునిసిపల్ ఉద్యోగినికి సత్కారం

పెనమలూరు, జూన్ 30: తాడిగడప మునిసిపాలిటీలో టౌన్‌ప్లానింగ్ అధికారిణిగా పని చేసి, ఉత్తమ అధికారిణిగా పేరు తెచ్చుకొన్న యార్లగడ్డ పద్మావతి పదవీ విరమణ సందర్భంగా ఆమెను తోటి ఉద్యోగులు, పూర్వ కమిషనరు డాక్టర్ ప్రకాశరావు అభినందించారు. కానూరులోని మన కల్యాణ మండపంలో నిర్వహించిన అభినందన సభలో డాక్టర్ ప్రకాశరావు మాట్లాడారు. విధి నిర్వహణలో పద్మావతి నిక్కచ్చిగా వ్యవహరించేవారని, మునిసిపాలిటీ అభివృద్ధిలో ఆమె పాత్ర చెప్పుకోదగ్గదని పేర్కొన్నారు. మునిసిపల్ ఉద్యోగులు మేనేజర్ విజయలక్ష్మి, ఏసీపీ మురళీగౌడ్, గిరి, పద్మావతిని దుశ్శాలువతో సన్మానించి అభినందించారు.



ట్రెండ్‌సెట్ మాల్ వద్ద ప్రదర్శనగా ఉంచిన కల్కి సినిమాలోని కారు బుజ్జి వద్ద ఫొటోలు దిగుతూ సందడి చేస్తున్న యువకులు, పిల్లలు

కల్కి కారు..అభిమానుల హుషారు!

ట్రెండ్‌సెట్ మాల్‌లో 'బుజ్జి' ప్రదర్శన ● చూసేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన అభిమానులు

విజయవాడ కల్చరల్, జూన్ 30: ప్రభాస్ నటించిన కల్కి 2898 ఏడీ సినిమా థియేటర్లలో అలరిస్తోంది. ఈ సినిమాలో ప్రభాస్ వినియోగించిన (ప్రత్యేకంగా రూపొందించిన) కారు 'బుజ్జి'ని నగరంలోని ట్రెండ్‌సెట్ మాల్ వద్ద ప్రదర్శనకు ఉంచారు. చూసేందుకు అభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. దాని పక్కన ఫొటోలు దిగేందుకు ఆసక్తి కనబరిచారు. విభిన్నమైన ఆకృతిలో ఉన్న ఈ బుజ్జి వాహనం వీక్షకులను ఆకట్టుకుంటోంది. వాహనాన్ని మహీంద్ర కంపెనీ వాళ్లు తయారీ చేశారు. సినిమాలో ప్రభాస్ పాత్ర కోసం బుజ్జిని రూ.7 కోట్ల ఖర్చుతో ఏఐ ఆధారంగా రూపొందించినట్లు డిజైనర్ రమేష్ తెలిపారు. ముందు టైర్ల రిమ్ పరిమాణం 34.5 అంగుళాలు, పొడవు 6,075 మిల్లీమీటర్లు, వెడల్పు 3,380 మిల్లీ మీటర్లు, ఎత్తు 2,186 మిల్లీమీటర్లు, వెనుక మరో భారీ టైర్ ఉంటుందని ఆయన తెలిపారు. గంటకి నలభై కిలోమీటర్లు ప్రయాణిస్తుందన్నారు. ఈ వాహనానికి చక్రాలను సీఎట్ కంపెనీ రూపొందించిదన్నారు. వాహనం బరువు వెనుక చక్రంపైనే ఉంటుందని, బ్యాటరీ ఫుల్ చార్జింగ్ పెడితే 50 కిలో మీటర్లు నడుస్తుందని తెలిపారు. సినీనటుడు మేడసారి కిరణ్ పాల్గొన్నారు.



అంబాపురంలో సర్వే నెం 98/2బీలో వైసీపీ నేతలు అమ్మకాలకు పెట్టిన కామన్ స్థలం



పలగాని రోడ్డులో కబ్జాకు గురైన పంచాయతీ స్థలం

ప్రభుత్వం మారినా ఉదాశీనతే!

అంబాపురంలో వంశీ అనుచరులు కబ్జా చేసిన భూముల స్వాధీనానికి అధికారుల వెనకడుగు

▸▸ స్థలాలు స్వాధీనం చేసుకోవాలని స్థానికుల డిమాండ్

విజయవాడ రూరల్: మండలంలోని అంబాపురం పంచాయతీ పరిధిలో వైసీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరుల భూ కబ్జాలపై చర్యలు తీసుకోవడంలో అధికారులు ఉదాశీన వైఖరి చూపుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో కోట్లాది రూపాయల ప్రభుత్వ భూములు కబ్జాకు గురైనా అధికారులు అప్పటి అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి చూసీచూడనట్టు వదిలేశారు. ఇప్పుడు ప్రభుత్వం మారినా అధికారులు కబ్జాలపై తూతూ మంత్రంగా చర్యలు తీసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం మారి, అధికారులపై ఎలాంటి ఒత్తిడి ఉండదని, ఆ స్థలాన్ని వైసీపీ నేతల చెర నుంచి విడిపించి స్వాధీనపరచుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. అంబాపురం పంచాయతీ పరిధిలో వల్లభనేని వంశీ అనుచరుడు వైసీపీ నేత బెంజిమెన్, అతని సోదరుడు విజయ్‌కుమార్‌లు మూడు చోట్ల కబ్జాలకు పాల్పడి మొత్తం రూ.10 కోట్ల విలువైన ప్రభుత్వ భూములకు ఎసరు పెట్టారు. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి పంచాయతీ స్థలాలను ఆక్రమించి అమ్మకాలకు పెట్టారు. దీనిపై గత నెలలో ఆంధ్రజ్యోతిలో 'కన్నుగప్పి కబ్జా' పేరుతో కథనం కూడా ప్రచురితమైంది. నెల తర్వాత ప్రభుత్వం మారడంతో అధికారులు స్పందించారు. మొత్తం మూడు చోట్ల వైసీపీ నేతలు కబ్జాలకు పాల్పడితే ఒక చోట మాత్రమే స్థలానికి ఫెన్సింగ్ వేసి వదిలివేశారు. రూ.10 కోట్లు విలువైన 3,370 గజాల స్థలాలు కబ్జా అయితే 370 గజాల స్థలానికి మాత్రమే అధికారులు ఫెన్సింగ్ వేశారు. 370 గజాల ఆక్రమిత స్థలంలో సగభాగంలో వైసీపీ నేత రేకుల షెడ్ నిర్మిస్తే, షెడ్ తొలగించకుండా పెయింటింగ్‌లతో ప్రభుత్వ స్థలంగా రాసి వదిలేశారు.

వైసీపీ నేతల చెరలో ఉన్న రూ.9 కోట్ల విలువైన స్థలాలివే..

పైపుల రోడ్డు సెంటర్ నుంచి మిల్క్‌ప్రాజెక్ట్‌కు వెళ్లే దారిలో ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని అంబాపురం పంచాయతీ 11వ లైన్‌లో సర్వే నెం.98/2బీలో 2వేల గజాల కామన్ స్థలం కబ్జాకు గురైంది. అప్పట్లో తహసీల్దార్ చర్యలకు పూనుకోగా రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు దాని జోలికి పోలేదు. మొత్తం 2 వేల గజాలను మూడు భాగాలుగా విభజించి కొలతలు వేసి నేతలు పంచేసుకున్నారు. ఆ స్థలాలు అమ్మకాలకు కూడా పెట్టినట్లు తెలిసింది. వైసీపీ నేతలు కబ్జా చేసిన 2 వేల గజాల విలువ రూ. 6 కోట్లు పైమాటే.

పలగాని రోడ్డులో రూ.3 కోట్ల స్థలం

ఇన్నర్ రింగ్‌రోడ్డును ఆనుకుని పైపుల రోడ్డు నుంచి మిల్క్ ప్రాజెక్ట్ వెళ్లే దారిలోని పలగాని రోడ్డు సర్వే నెం 94/2లో రూ. 3 కోట్లు విలువైన వెయ్యి గజాల స్థలం వైసీపీ నేతల కబంధ హస్తాల్లోనే ఉండిపోయింది. అప్పట్లో అధికారులు ఆ స్థలానికి ఫెన్సింగ్ వేసి హెచ్చరిక బోర్డులు రాయించినా బోర్డులను ధ్వంసంచేసి అన్నదమ్ములిద్దరు స్థలంలోకి చొరబడి కబ్జా చేశారు.

సర్వే చేసి ఫెన్సింగ్ వేస్తాం

కబ్జాల వ్యవహారం మాదృష్టికి వచ్చింది. వీఆర్వో, సర్వేయర్లను పిలిపించి అధికారుల సమక్షంలో భూములను సర్వే చేయిస్తాం. కబ్జా అయిన భూములను గుర్తించి, స్వాధీనం చేసుకుని, ఫెన్సింగ్ వేస్తాం.

-డి.శ్రీనివాస్, అంబాపురం పంచాయతీ ఈవో

19 నుంచి దుర్గగుడిలో శాకంబరి ఉత్సవాలు

▸▸ మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తాం: ఈవో కేఎస్ రామారావు

వన్‌టౌన్, జూన్ 30: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో జూలై 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు శాకంబరీదేవి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో కేఎస్ రామారావు తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 19వ తేదీన ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, అఖండ దీపారాధన, అంకురార్పణ నిర్వహిస్తామని, సాయంత్రం 4 గంటలకు కలశస్థాపన చేసి అగ్ని ప్రతిష్ఠాపన, మండపారాధన, హారతి, మంత్రపుష్పం, ప్రసాద వితరణలు ఉంటాయని తెలిపారు. 20వ తేదీ ఉదయం 8 గంటలకు సప్తశతి, మహా విద్యా పారాయణలు, హోమాలు ఉంటాయని సాయంత్రం 5 గంటలకు మూలమంత్ర హవనాలు, 21వ తేదీ ఉదయం 8 గంటలకు సప్తశతి, మహా విద్యా పారాయణలు, శాంతి పౌష్టిక హోమాలు, మంటపపూజలు నిర్వహిస్తామని తెలిపారు. అవి ముగిశాక 9.30 గంటలకు పూర్ణాహుతి, కలశోద్వాసన, మార్జనం, ప్రసాద వితరణలతో శాకంబరీ దేవి ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.



డీజీపీ ద్వారకా తిరుమలరావు కుటుంబసభ్యులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో కేఎస్ రామారావు

దుర్గమ్మను దర్శించుకున్న డీజీపీ

వన్‌టౌన్: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను ఆదివారం డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. ఆయనకు ఈవో కేఎస్ రామారావు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రాన్ని ఈవో అందజేశారు. దుర్గగుడిలోని ధర్మపథం వేదికపై రాయన శ్రీనివాసరావు బృందం ఆంధ్రనాట్య ప్రదర్శనను నిర్వహించింది. ఆహూతులను అలరించారు.

6 నుంచి వారాహిదేవి పూజలు, ఆషాఢ సారె సమర్పణలు

జూలై 6 నుంచి 15వ తేదీ వరకు దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో తొలిసారిగా వారాహిదేవి పూజాదికాలు జరుగుతాయని ఈవో పేర్కొన్నారు. దేవస్థానం అర్చకులు ప్రత్యేకంగా జప, తప, హోమాదులు నిర్వహించి అమ్మవారికి తర్పణ చేస్తారని, ఇవి అంతర్గతంగా జరుగుతాయని పేర్కొన్నారు. ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని జూలై 6వ తేదీ నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు కనకదుర్గమ్మకు పవిత్రసారె సమర్పించే కార్యక్రమాలు ఉంటాయన్నారు. అమ్మవారికి మహామండపం ఆరో అంతస్థులో సారె స్వీకరణ, పూజాదికాలు నిర్వహిస్తారని తెలిపారు. జూలై 14వ తేదీన హైదరాబాద్ పాతబస్తీ నుంచి ఉమ్మడి దేవాలయాల కమిటీ బంగారు బోనం సమర్పణ ఉంటుందన్నారు. జూలై 26వ తేదీన దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం తరఫున భాగ్యనగర్ మహాంకాళీ అమ్మవారి ఉమ్మడి దేవాలయాల ఉత్సవాలకు పట్టువస్త్రాల సమర్పణ చేస్తామన్నారు.

19, 20 తేదీల్లో వద్దిపర్తి పద్మాకర్ ప్రవచనం

తుమ్మలపల్లి వారిక్షేత్రయ్య కళాక్షేత్రంలో జూలై 19, 20 తేదీల్లో కనకదుర్గాదేవి మహిమలపై ప్రముఖ ఆధ్యాత్మిక, ధార్మిక ప్రవచనకర్త వద్దిపర్తి పద్మాకర్ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ప్రవచనం చేస్తారని తెలిపారు. సమావేశంలో స్థానాచార్యుడు శివప్రసాదశర్మ, ముఖ్య అర్చకుడు బద్రీనాథ్‌బాబు, ముఖ్య అర్చకుడు ఆర్. శ్రీనివాసశాస్త్రి, ఈఈలు కోటేశ్వరరావు, రమాదేవి, ఏఈవో రమేష్‌బాబు, డీఈ కోటేశ్వరరావు పాల్గొన్నారు.



సన్మాన సభలో ఉద్యోగుల సేవలను ప్రశంసిస్తున్న బ్యాంకు సిబ్బంది

సప్తగిరి బ్యాంకు ఉద్యోగుల సేవలు అభినందనీయం

అజిత్‌సింగ్‌నగర్, జూన్ 30: సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సేవలు అభినందనీయమని బ్యాంక్ రీజనల్ మేనేజర్ నాయుడు బ్రహ్మయ్య పేర్కొన్నారు. ఆరుగురు బ్యాంకు ఉద్యోగుల పదవీ విరమణ సభ పైపుల రోడ్డు వద్ద వైఏస్సార్ కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలను అందజేశారు. ఖాతాదారులకు వారు అందించిన సేవలను కొనియాడారు. చీఫ్ మేనేజర్లు యార్లగడ్డ మాధవి, ఎంవీ నాగిరెడ్డి, సీనియర్ మేనేజర్లు టి.సత్యనారాయణ, వాసన వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ మేనేజర్లు పి.సాంబశివరావు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కృష్ణలంక, జూన్ 30: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహిస్తామని ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మున్సిపల్, మండల కేంద్రాల్లో అధికారులు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని ఆమె తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తామని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

రామరాజు సేవలు మరువలేనివి

▸▸ డిప్లొమా ఇంజనీర్ల సంఘం నేత పదవీ విరమణ సభలో ఈఎన్‌సీ

విజయవాడ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజనీర్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి దాట్ల దశరథరామరాజు ఇంజనీర్లకు అందించిన సేవలు మరువలేనివని పంచాయతీరాజ్ ఈఎన్‌సీ బాలూనాయక్ ప్రశంసించారు. 30 ఏళ్ల పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో సేవలందించి జూన్ నెలాఖరులో పదవీ విరమణ చేసిన ఆయనను పంచాయతీరాజ్ డిప్లమో ఇంజనీర్ల అసోసియేషన్ తరఫున ఏపీఎన్జీవో కార్యాలయంలో ఆదివారం సన్మానించారు. ఇంజనీర్ల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ తరఫున రామరాజు విశేష సేవలందించారని బాలూనాయక్ తెలిపారు. సౌమ్యంగా, లౌక్యంగా ఉన్నతాధికారులతో చర్చించి సమస్యలను కొలిక్కి తీసుకురావడంలో రామరాజుతో పాటు సోమేశ్వరరావు జంటను కొనియాడకుండా ఉండలేమన్నారు. ఉన్నతాధికారులతో సఖ్యతతో మెలుగుతూ ఉద్యోగుల సర్వీసును పోరాడి సాధించిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. ఉద్యోగ సంఘం నేతగా రామరాజు చిత్తశుద్ధితో పనిచేసేవారని ఏపీ ఎన్జీవో కృష్ణాజిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు అన్నారు. నిస్వార్థ ఇంజనీర్ల నాయకుడు రామరాజు అని డిప్లమో ఇంజనీర్ల అసోసియేషన్ రాష్ట్ర సలహాదారు వి.హనుమంతరావు కొనియాడారు. ఏపీఎన్జీవో అధ్యక్షుడు శివారెడ్డి, ఇంజనీర్ల అసోసియేషన్ జేఏసీ కార్యదర్శి సంగీతరావు, డిప్లమో ఇంజనీర్ల అసోషియేషన్ గౌరవాధ్యక్షుడు రియాజ్, అధ్యక్షుడు రవీంద్ర, కార్యదర్శి రత్నప్రసాద్, సోమేశ్వరరావు పాల్గొన్నారు.



దాట్ల దశరథరామరాజు పదవీ విరమణ సభలో మాట్లాడుతున్న ఈఎన్‌సీ బాలూనాయక్



అశోక్ కుమార్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా



సత్కరిస్తున్న ఉద్యోగ సంఘాల నేతలు విద్యాసాగర్ తదితరులు

చలసాని అశోక్‌కుమార్ సేవలు అభినందనీయం

కూచిపూడి, జూన్ 30: పంచాయతీరాజ్ శాఖలో 33 ఏళ్ల వివిధ హోదాల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన చలసాని అశోక్‌కుమార్ సేవలు అభినందనీయమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. ఆదివారం భట్లపెనుమర్రులోని పింగళి వెంకయ్య భవన్‌లో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉద్యోగ సంఘాల నాయకుడిగా అశోక్ కుమార్ సమర్థవంతంగా పనిచేశారని ఆయన ప్రశంసించారు. అశోక్ కుమార్‌ను దుశ్శాలువాలతో సత్కరించి మెమెంటో అందించి అభినందించారు. కళ్లేపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆనంద్ కుమార్, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ వెస్ట్ కృష్ణా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, ఉద్యోగ సంఘాల నేతలు జె.ఎల్.ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు, ఎంపీపీ కొండేటి ఇందిర, సర్పంచ్ మట్టా ఇందిర, ఉభయ కృష్ణా జిల్లాలకు చెందిన ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు. అశోక్ కుమార్ దంపతులను వారు ఘనంగా సత్కరించారు.

జోగి భూ కబ్జా వ్యవహారంలో సస్పెండైన

మండల సర్వేయర్ రమేశ్ నిర్వాకం

▸▸ సస్పెన్షన్ ఆర్డర్ రాకుండా సర్వేశాఖ ఉన్నతాధికారులకు లంచం!

▸▸ ఆయనతో పాటు సస్పెండైన మరో ఇద్దరికి ఉత్తర్వులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): సీఐడీ అటాచ్‌లో ఉన్న అగ్రిగోల్డ్ భూములను మాజీ మంత్రి జోగి రమేశ్ కబ్జా చేశారని ఆరోపణలున్న వ్యవహారంలో కీలక సూత్రధారిగా ఉన్న విజయవాడ రూరల్ మండల సర్వేయర్ రమేశ్ సస్పెండ్ వేటు నుంచి తప్పించుకోవటానికి జిల్లా, రాష్ట్ర సర్వేశాఖ ఉన్నతాధికారులకు భారీగా ముడుపులు సమర్పించుకున్నట్టుగా తెలుస్తోంది. అగ్రిగోల్డ్ భూముల అన్యాక్రాంతంలో బాధ్యులైన వారిపై తహసీల్దార్ జాహ్నవి నివేదిక ఆధారంగా విజయవాడ రూరల్ మండల డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్, గ్రామ సర్వేయర్లను సస్పెండ్ చేయమని అప్పటి కలెక్టర్ ఢిల్లీ రావు ఆదేశాలు జారీ చేశారు. వీరిలో సస్పెండైన మండల సర్వేయర్ రమేశ్ మాత్రం డబ్బులతో తిరిగి పోస్టు తెచ్చుకునేందుకు ప్రయత్నించడం విమర్శలకు తావిస్తోంది. మిగిలిన ఇద్దరికీ సస్పెన్షన్ ఆర్డర్స్ వచ్చినా మండల సర్వేయర్‌కు మాత్రం రాలేదు. జిల్లా సర్వే శాఖ ఉన్నతాధికారితో పాటు, రాష్ట్ర స్థాయిలో సర్వేశాఖ ఉన్న తాధికారుల దగ్గర ఉన్న తన పలుకుబడితో కొంత, డబ్బులు ముట్టచెప్పి తనకు సస్పెండ్ ఆర్డర్ రాకుండా చూసుకున్నట్టుగా తెలుస్తోంది. ఈ వ్యవహారంపై కలెక్టర్ సృజన విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఆర్టీసీ అద్దె బస్సుడ్రైవర్‌పై దాడి చేసిన నకిలీ విలేకరి అరెస్టు

గుడివాడ: అవనిగడ్డ డిపో ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్‌పై దాడి చేసి, దుర్భాషలాడిన కేసులో నకిలీ విలేకరిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైవర్ సిరివెళ్ల రాకేష్‌పై గుడివాడకు చెందిన పట్టపు శివ వెంకటనాగేంద్ర, నకిలీ విలేకరి పంచకర్ల శ్రీనివాస్ మద్యం మత్తులో దాడి చేశారని తెలిపారు. వీరిలో శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నామని, మరో నిందితుడు పట్టపు శివవెంకటనాగేంద్ర పరారీలో ఉన్నాడని పేర్కొన్నారు.

నేటి నుంచి పీఏసీఎస్ సీఈవోలకు శిక్షణ

మచిలీపట్నం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పరపతి సహకార సంఘాల(పీఏసీఎస్) పని తీరును మెరుగుపరిచేందుకు, సేవలను సులభతరంగా అందించేందుకు నేషనల్ కౌన్సిల్ ఫర్ కో-ఆపరేటివ్ శిక్షణ సంస్థ (ఎన్‌సీసీటీ)ద్వారా కృష్ణాజిల్లాలోని 188 పీఏసీఎస్‌లలో పనిచేసే సీఈవోలకు ఎస్‌వీహెచ్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నుంచి నాలుగు రోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్టు జిల్లా సహకారశాఖ అధికారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 300రకాల ఆన్‌లైన్ సేవలు అందించడం, పీఏసీఎస్‌లలో పరిపాలనా పరమైన అంశాలపైన శిక్షణ ఇస్తామని ఆయన తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ఎన్‌సీసీటీ సమన్వయకర్త ప్రొఫెసర్ ఎస్ ఎల్ ఎస్టీ శ్రీనివాస్ తదితరులు శిక్షణ ఇస్తారని ఆయన పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.35

విద్యార్థులకు అనుమోలు వితరణ

గోసాల (కంకిపాడు), జూన్ 30 : అన్ని దానాల్లోకి విద్యాదానం గొప్పదని టీడీపీ నాయకుడు అనుమోలు ప్రభాకరరావు అన్నారు. అనుమోలు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అనుమోలు సత్యనారాయణ, అనుమోలు బాలమురళీ, అనుమోలు గణేష్, అనుమోలు హరి, గోసాల మాజీ సర్పంచ్ కోనేరు కోటేశ్వర రావు, అనుమోలు నవీన్ పాల్గొన్నారు.



విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేస్తున్న అనుమోలు ప్రభాకరరావు

ఆక్రమణల చెర!

- కానూరు నవతా రోడ్డును ఆక్రమిస్తున్న లారీల బాడీలు
- రోడ్డుకిరువైపులా చెత్త డంపింగ్
- తీవ్ర ఇబ్బంది పడుతున్న స్థానికులు, ప్రయాణికులు
- మురుగు, చెత్తతో పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు
- పట్టించుకోని అధికారులు



కానూరు నవతా రోడ్డు ఆక్రమణ

పెనమలూరు, జూన్ 30 : నిత్యం వేలాది మంది ప్రయాణించే అత్యంత ప్రాధాన్యత ఉన్న కానూరు నవతా రోడ్డుపై ప్రయాణం అంటేనే ప్రజలు హడలెత్తిపోతున్నారు. కానూరు మురళీనగర్ మీదుగా ఏలూరు రోడ్డును, మహానాడు రోడ్డు మీదుగా ఆటోనగర్, విజయవాడ నగరాన్ని, కానూరు మీదుగా వందడుగుల రోడ్డును, పంట కాల్వరోడ్డు మీదుగా బందరు రోడ్డును అనుసంధానించే కీలక మార్గమయిన నవతా రోడ్డు వెడల్పును ఆక్రమణలు కుదించి వేస్తుండడంతో సగానికి సగం రోడ్డు కనిపించడంలేదు. లారీల యజమానులు బాడీ బిల్డింగ్ పేరుతో లారీల బాడీలను రోడ్డు మీదే నిర్మించడం, లారీల స్ర్కాప్‌ను, వ్యర్థాలను రోడ్డుపైనే పడవేస్తుండంతో రోడ్డు కుంచించుకు పోతోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం రద్దీ సమయాల్లో పాఠశాల బస్సులు, ప్రయాణికుల వాహనాలతో రోడ్డుపై భారం ఎక్కువవుతోంది. అదే సమయాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలల నుంచి ఇళ్లకు తీసుకెళ్లే ప్రయత్నాల్లో రోడ్డుపై రద్దీతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెదపులిపాక, చోడవరం, పోరంకి, పెనమలూరు వైపు నుండి ఆటోనగర్‌కు నవతా రోడ్డుపైనే నిత్యం వేలాది కార్మికులు ప్రయాణాలు కొనసాగిస్తుంటారు. రోడ్డుపై ఆక్రమణల వల్ల రోడ్డు ఇరుకుగా మారడంతో వారికి ప్రయాణం దుర్లభంగా మారింది. వర్షాకాలం చెత్తచెదారం డంపింగ్ వల్ల అది కుళ్లి వచ్చిన మురుగు రోడ్డు మార్జిన్‌లలో తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. చుట్టు ప్రక్కలా, రోడ్డు పొడవునా ఉన్న లారీ యూనిట్లు చెత్త డంపింగ్ యథేచ్ఛగా చేస్తుండంతో రోడ్డు పొడవునా దుర్వాసన వ్యాపించి శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, డయేరియా లాంటి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. వర్షాకాలంలో శానిటేషన్ విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం ప్రయాణికులకు శాపంగా మారింది. గతంలో ఇలా ప్రతినిధులు పోలీసు శాఖతో సమన్వయంతో పనిచేసి ఆక్రమణలు తొలిగింపచేసేవారు. కానీ కొన్ని నెలలుగా పోలీసు శాఖ నిర్లక్ష్యం మూలాన ఆక్రమణలు తిరిగి మొదలవడంతో ప్రయాణికులు చుక్కలు చూస్తున్నారు. సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించి ఆక్రమణలు, చెత్త చెదారం డంపింగ్‌ను అరికట్టి ప్రజల ఇబ్బందులు తొలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

పింఛన్ల పంపిణీలో పాల్గొనాలి

కూటమి నాయకులకు ఎమ్మెల్యే యార్లగడ్డ పిలుపు

ఉంగుటూరు, జూన్ 30 : రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆదేశాల మేరకు నేటి నుంచి గన్నవరం నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టనున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పిలుపునిచ్చారు. ఆదివారం ఉంగుటూరులో మాట్లాడుతూ, గన్నవరం నియోజకవర్గ ప్రజలందరి మద్దతుతో ప్రజలకు అండగా నిలిచే ప్రజాప్రభు త్వం ఏర్పాటైందని, ఏ ఆశలు, ఆకాంక్షలతో ప్రజలు ఓట్లువేసి గెలిపించారో వాటిని నెరవేర్చడమే తక్షణ, ప్రథమ కర్తవ్యంగా ఈ ప్రజా ప్రభుత్వం అడుగులు వేస్తుందని చెప్పారు. ఎన్నికల సమయంలో రాజకీయలబ్ధి కోసం వైసీపీ ప్రభుత్వం పింఛన్ పంపిణీ విషయంలో లబ్ధిదారులను ఎంతో క్షోభకు గురిచేసిందన్నారు. పింఛన్ సొమ్ము కోసం మూడు నెలలపాటు మండుటెండలో, వడగాడ్పుల మధ్య బ్యాంకులచుట్టూ తిరగలేక పింఛన్‌దారులు పడిన కష్టాలు చూసి చలించిపోయిన ఆనాటి ప్రతిపక్షనేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఏప్రిల్ నెలనుంచే పింఛన్ పెంపును వర్తింపచేస్తామని మాటిచ్చారన్నారు. అందులో భాగంగా మొత్తం 7వేలు పింఛన్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 48,753మంది పింఛన్‌దారులకు 32.80కోట్ల నగదును పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. గ్రామసచివాలయసిబ్బందితో సమన్వయం చేసుకుని పండుగ వాతావరణంలో పింఛన్లను లబ్ధిదారుల ఇళ్లవద్దనే అందజేసి, ప్రజలపట్ల నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని వివరించాలని మూడు పార్టీల నాయకులకు సూచించారు.

100 మందికి వైద్యపరీక్షలు

ముదునూరు (ఉయ్యూరు), జూన్ 30 : ముదునూరు గ్రామపంచాయతీ, సెంటినీ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించి వందమందికి వైద్యపరీక్షలు చేశారు.



ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరంలో గుండె సంబంధిత 2డి ఎకో, ఈసీజీ, షుగర్, బీపీ తదితర పరీక్షలు చేశారు. టీడీపీ నాయకులు మొవ్వ జ్ఞానశేఖర్, పాలడుగు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పల్లపోతు శ్రీనివాసరావు శిబిరాన్ని ప్రారంభించారు. చిన్న వయస్సువారు సైతం గుండె సంబంధిత వ్యాధితో ప్రాణాలు కోల్పోతున్న నేటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ వైద్యపరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలు పాటించి ఆహార అలవాట్లు, వ్యాయామాలతో ఆరోగ్యంగా జీవించవచ్చని డాక్టర్ శ్రీపతి తెలిపారు. సెంటినీ హాస్పిటల్ వైద్య సిబ్బంది వైద్యసేవలందించారు.

టీడీపీ నేత చంటికి ఘన నివాళి



చంటి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బోడె ప్రసాద్

పెనమలూరు, జూన్ 30 : పెనమలూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు అర్వపల్లి చంటికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఘనంగా నివాళులర్పించారు. అర్వపల్లి చంటి దశదిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, చంటి మృతి టీడీపీకి తీరని లోటన్నారు. చంటి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్ తదితరులు ఉన్నారు.

● కానూరు సిద్ధార్థ కళాశాల సమీపంలో పూడుకుపోయిన మురుగు కాల్వలను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆదివారం పరిశీలించారు. మురుగు వ్యవస్థను ప్రక్షాళించే దిశగా ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, అంగిరేకుల మురళి, యార్లగడ్డ సత్యనారాయణ ఉన్నారు.

తాత్కాలికంగా రోడ్డు నిర్మాణం

యనమలకుదురు 17, 18వ డివిజన్‌లో గల చేపల మార్కెట్ వద్ద వర్షాలకు ఇబ్బందిగా మారడంతో స్థానికులు టీడీపీ స్థానిక నాయకుడు మొక్కపాటి శ్రీనివాస్ సహకారంతో 60 మీటర్ల మేర తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేసుకొన్నారు. కార్యక్రమంలో పండుల రజిని, సింగం సుబ్రహ్మణ్యం, కొడాలి ఉమామహేశ్వరరావు, బలగం కొండ, బుజ్జి, తాడిశెట్టి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆదరించిన ప్రజలకు అండగా ఉంటా

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



గోసాల విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

గోసాల (కంకిపాడు), జూన్ 30 : ఆదరించిన ప్రజలకు అండగా ఉంటా నని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. గోసాలలో ఆదివారం నిర్వహిం చిన విజయోత్సవ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పెనమలూరు నియోజక వర్గంలో 2009 నుంచి 2024 వరకు జరిగిన ఎన్నికల్లో ఎన్నడూ లేని విధంగా 60 వేల మెజారిటీ ఇవ్వడం జరిగిం దన్నారు ప్రజలను తనను ఏ విధంగా ఆదరించారో అర్థం అవుతుందని, ఆదరించిన నియోజక వర్గ ప్రజలకు తాను అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ప్రజలు ఎదు ర్కొంటున్న రోడ్లు, డ్రెయినేజీ వంటి ప్రధాన సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి తక్షణ పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపడతానన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా పోరంకిలోని తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో అనుమోలు ప్రభాకర్, కోయా ఆనంద్, సెంగెపు రంగారావు, కోనేరు సాంబశివరావు, మాబు సుబాని, ఆంజనేయులు, కోటేశ్వరరావు, కాసరనేని మురళి, ఎండవ రాంబాబు, బిల్లా సత్యనారాయణ, షేక్ లాలీ పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

పెనమలూరు : 2019లో గత ముఖ్యమంత్రి జగన్ రెడ్డి తెచ్చిన సీసీఆర్‌సీ చట్టాన్ని సవరించి కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులివ్వాలని డిమాండ్ చేస్తూ కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీ కౌలు రైతు సంఘం కృష్ణాజిల్లా అధ్యక్షులు పంచకర్ల రంగారావు మాట్లాడుతూ, రైతాంగం సాధించుకొన్న 2011 కౌలు రైతుల చట్టాన్ని గత ప్రభుత్వం నిర్ధాక్షిణ్యంగా రద్దు చేసిందని, భూయజమాని సంతకం ఉంటేనే కౌలు రైతులకు గుర్తింపు కార్డులిస్తామని ప్రకటించిందని వాపోయారు. దీనివల్ల వాస్తవ సాగుదారులయిన కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రైతు భరోసా, ఈ క్రాప్ బుకింగ్, పంటబీమా, పంట నష్టపరిహారాలు, బ్యాంకు రుణాలు తదితరాలు ఏవీ అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే బోడె మాట్లాడుతూ, కౌలు రైతుల ఇబ్బందులను అసెంబ్లీలో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మాదు నాగేశ్వరరావు, పెదపూడి శ్రీనివాస్, మరియదాసు, త్రిమూర్తులు, రాంబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ఉయ్యూరు ముందంజ

లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఎన్.శివశంకర్‌గుప్తా

ఉయ్యూరు, జూన్ 30 : సేవా కార్యక్రమాల్లో ఉయ్యూరు లయన్స్ క్లబ్ ముందంజలో ఉంటుందని క్లబ్ జిల్లా గవర్నర్ ఎన్.శివశంకర్‌గుప్తా కొనియాడారు. గవర్నర్ అధికార పర్యటన, క్లబ్ చేపట్టిన సేవా కార్యక్రమాల పరిశీలనలో భాగంగా ఆదివారం ఉయ్యూరు విచ్చేశారు. ఈ సందర్భంగా శ్రీవిశ్వశాంతి విద్యాసంస్థల ఆవరణలో కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గవర్నర్ దంపతులు పాల్గొన్నారు. క్లబ్ అధ్యక్షుడిగా ఎండీ ఇస్మాయిల్ పదవీ కాలంలో చేపట్టిన సేవా కార్యక్రమాల ప్రదర్శన తిలకించి కార్యవర్గాన్ని అభినందించారు.

కుట్టు మిషన్, సైకిల్ అందజేత

గవర్నర్ అధికార పర్యటన సందర్భంగా ఉయ్యూరు క్లబ్ ఆధ్వర్యంలో శిరీషా మానసిక దివ్యాంగ బాలల ఆశ్రమానికి ఆటవస్తువులు, పేద మహిళకు కుట్టుమిషన్, యువకులకు క్రికెట్ కిట్, పేద విద్యార్థినికి సైకిల్, పారిశుధ్య కార్మికులకు వస్త్రాలు ఆయన అందజేశారు. క్లబ్ జిల్లా క్యాబినెట్ ప్రతినిధులు నూకల వెంకట సాంబశివరావు, చెన్నారెడ్డి, జి. చక్రధర్, రీజినల్ చైర్మన్ బండి జ్యోతి, ఉయ్యూరు క్లబ్ కార్యదర్శి నల్లా శ్రీనివాస్, ట్రెజరర్ ఊర కిషోర్, ప్రతినిధులు రావులపల్లి సుధాకర్, చిందా కుటుంబరాజు, క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు నేరెళ్ల తేజసాయి వెంకట్, నెల్లి రాంబాబు, దినవహి ప్రసాద్ పాల్గొన్నారు.



మహిళకు కుట్టుమిషన్ అందజేస్తున్న ఉయ్యూరు లయన్స్ క్లబ్ సభ్యులు

పవిత్రమైనది ఉపాధ్యాయ వృత్తి

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు

గన్నవరం(ఉంగుటూరు), జూన్ 30 : పవిత్రమైనది ఉపాధ్యాయ వృత్తి అని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు అన్నారు. గన్నవరం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, యూటీఎఫ్ నాయకుడు కే మాణిక్యాలరావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమం స్థానిక రాయ్‌నగర్ కళ్యాణ మండపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. వీరితో పాటుగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జె.లెనిన్‌బాబు, కోశాధికారి మరీదు వరప్రసాద్, బాపులపాడు, ఉంగుటూరు ఎంఈవోలు సురేష్‌కుమార్, సాంబశివరావు,

పేద, అనాథ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 30 : సామాజిక అవసరాలను గుర్తెరిగి సేవలందించడంతో పాటు విద్యాభివృద్ధికి సహకారమందిం చడమే రాణా వెల్ఫేర్ సొసైటీ లక్ష్యమని అధ్యక్షుడు సుంకర సాంబశివరాయల్ తెలిపారు. కానుమోలుకు చెందిన రాణా వెల్ఫేర్ పేద, అనాథ విద్యార్థులకు రూ. 35వేల విలువ చేసే పుస్తకాలను ఆదివారం అందజేశారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

పెనమలూరు, జూన్ 30 : విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన కానూరు వందడుగుల రోడ్డులో జరిగింది. ఆదివారం జరిగిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి వివరాలను వెల్లడించారు. మచిలీపట్నానికి చెందిన కుంబ దత్తాత్రేయ తనకు చెందిన టాటాఏస్ వాహనంలో తన బంధువుల ఇంటికి వచ్చాడు. తన బంధువులకు చెందిన చికెన్ సెంటరుకు సంబంధించిన వేస్ట్‌ను తన వాహనంలో ఎక్కించి వందడుగుల రోడ్డులో వెళుతుండగా వాహనం అదుపు తప్పి సైడు కాల్వలో పడింది. దీన్ని బయటికి తీయడానికి అతడు ఒక జేసీబీనీ మాట్లాడి తీసుకువచ్చి వ్యాన్‌ను తీయడానికి ప్రయత్నిస్తుండగా జేసీబీకి చెందిన కొక్కెం అక్కడే పైగా వెళుతున్న విద్యుత్ తీగలకు తగలడంతో వ్యాన్‌ను పట్టుకునే ఉన్న దత్తాత్రేయకు విద్యుత్ షాక్ తగిలింది. దీనితో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎన్నికల హామీలకు టీడీపీ కట్టుబడి ఉంది

కంకిపాడు, జూన్ 30 : ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు టీడీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని పార్టీ నాయకులు పులి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా పెంచిన పింఛన్ రూ. 4 వేలతో పాటు గత మూడు నెలలకు సంబంధించిన రూ. 3 వేలు కలిపి జూలై 1వ తేదీన లబ్ధిదారుల ఇంటి వద్దనే పంపిణీ చేస్తామన్నారు. పార్టీ నాయకులు ఏనుగ జయప్రకాష్, షేక్ బాజి తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్ 127, 136, 147
చికెన్ విత్ స్కిన్ 240
చికెన్ స్కిన్‌లెస్ 250
నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ.5.35



అనర్హుల పింఛన్లు తొలగించాలి : టీడీపీ వినతి

గుడ్లవల్లేరు : విచారణ జరిపి అనర్హుల పింఛన్లు తొలగించి, నిజమైన లబ్ధిదారులకే పింఛన్లు అందజేయాలని టీడీపీ నాయకులు అధికారులను కోరారు. దొంగ సర్టిఫికెట్లతో పింఛన్లు పొందుతున్న వారిని గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేసినట్లు టీడీపీ నాయకులు సూరపనేని పరంధామయ్య, వల్లభనేని రంగబాబు తెలిపారు. అధికారులు వెంటనే విచారణ జరిపి అనర్హుల పింఛన్లు నిలిపివేయాలన్నారు. గుడ్లవల్లేరులో ఆరుగురు, కూరాడ, లాక్‌డౌన్‌లలో 20 మంది, వడ్లమన్నాడులో ఎనిమిది మందికి, డోకిపర్రులో ఆరుగురు మొత్తం మండలంలో 50 మందికి పైగా ఫేక్ వికలాంగ సర్టిఫికెట్లతో పింఛన్లు పొందుతున్నట్లు గుర్తించామన్నారు.

అవినీతి, అక్రమాలు సహించేది లేదు

అవనిగడ్డ, జూన్ 30 : వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగానే ప్రజలు కూటమికి మద్దతునిచ్చి గెలిపించారని, మళ్లీ అవే అక్రమాలు చేస్తామంటే సహించేది లేదని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. అవనిగడ్డ నియోజకవర్గ స్థాయి టీడీపీ, జనసేన, బీజేపీ సమన్వయ కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో సహజ వనరుల దోపిడీ విచ్చలవిడిగా సాగిందన్నారు. వైసీపీ అరాచక పాలనకు, దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చారన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పార్టీ శ్రేణులు పని చేయాలని సూచించారు. ఎవరైనా అక్రమార్కులకు సహకరించినా, అక్రమ వ్యాపారాలు చేసినా ఎట్టి పరిస్థితుల్లోనూ మద్దతు ఇవ్వబోనని, తనకు రాజకీయాలకంటే ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రధానమన్నారు. ఇసుక, మట్టి, బుసక అక్రమ రవాణా, రేషన్ బియ్యం దందా, జూద క్రీడల నిర్వహణ వంటి కార్యకలాపాలకు శ్రేణులు దూరంగా ఉండాలన్నారు.

పెదకళ్లేపల్లి పీహెచ్‌సీ తనిఖీ

మోపిదేవి : పెదకళ్లేపల్లి పీహెచ్‌సీని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 24 గంటలు వైద్య సేవలు అందిస్తున్నారని, స్టాఫ్ నర్సును మరొకరిని ఏర్పాటు చేయాలని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. మండలి వెంకట్రామ్, కడవకొల్లు సీతారామాంజనేయులు, అరజా కిరణ్ కాంత్, గొర్రెపాటి నాగేశ్వరరావు, కురేటి జగన్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌ను సత్కరిస్తున్న వైఖానస సంఘం నేతలు



పీహెచ్‌సీలో వైద్యసేవలు తెలుసుకుంటున్న మండలి

మండలికి వైఖానస సంఘం అభినందనలు

అవనిగడ్డ : ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను దివి తాలూకా వైఖానస సంఘం సభ్యులు ఆదివారం ఆయన స్వగృహంలో కలసి వేదాశీస్సులు అందించారు. బార్లపూడి గ్రామానికి చెందిన ఆగమ పండితుడు దీవి రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలోని సభ్యుల బృందం మండలిని దుశ్శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా దీవి వంశీయులు చరిత్రను, వంశ వృక్షాన్ని రూపొందిస్తున్నట్టు మండలికి వివరిస్తూ ముందుమాట వ్రాయాలని కోరగా, అందుకు అంగీకరించారు.

పింఛన్ల పంపిణీలో మొదటి స్థానం సాధించాలి

అవనిగడ్డ : పింఛన్ల పంపిణీలో అవనిగడ్డ నియోజకవర్గం మొదటి స్థానం సాధించేలా అధికార యంత్రాంగం సమిష్టి కృషి చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కోరారు. ఆదివారం ఈ మేరకు ఆయన అవనిగడ్డలో ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాప్రతినిధుల కోసం ఎదురు చూసి పంపిణీ ఆలస్య చేయకుండా పేదల పింఛన్ల పంపిణీ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం వేగవంతంగా నిర్వహించి జిల్లాలో మొదటి స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు.

ఆర్యవైశ్య సంఘం కృతజ్ఞతలు

అవనిగడ్డ : కన్యకా పరమేశ్వరీ దేవాలయానికి స్థలాన్ని మంజూరు చేయటం పట్ల ఆర్యవైశ్య సంఘ నేతలు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ నేతలు ఘంటసాల రాజమోహనరావు, దేసు జగన్మోహనరావు, మానేపల్లి ప్రవీణ్, చెన్నగిరి భుపేష్, చెన్నగిరి అయ్యప్ప, మల్లికాంబ, గోపిదుర్గ తదితరులు పాల్గొన్నారు.



కైతేపల్లికి ప్రజా సంఘాల సత్కారం

చల్లపల్లి : తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కైతేపల్లి దాస్‌ను ఆదివారం అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా సత్కరించారు. ప్రజాసంఘాల నేతలు, దళితసంఘాల నేతలు పాల్గొని దాస్ మాస్టారును సత్కరించారు. అడ్డాడ ప్రసాద్‌బాబు, దాసి సీతారామరాజు, అడపా గురవయ్య, బుల్లా కిషోర్, ఉప్పాల సాంబశివరావు, నర్రా చిన్ని, మాతంగి నరసింహారావు, శంకర్రావు, నర్రా చిన్ని, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కొండాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

గుడ్లవల్లేరు : వేమవరం కొండాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సుమారు 15వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు.

రోటరీ క్లబ్ కార్యవర్గం

గుడివాడ : గుడివాడ రోటరీ క్లబ్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా టి.ఎస్ రాజశేఖర్, జి.కిరణ్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం జి.వి పూర్ణచంద్రరావు కమ్యూనిటీ హాల్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు నూతన అధ్యక్షకార్యదర్శులు తెలిపారు.



మల్లాయపాలెంలో టిడ్కో లబ్ధిదారుల ఆందోళన

మల్లాయపాలెంలో టిడ్కో లబ్ధిదారుల ఆందోళన

గుడివాడ, జూన్ 30 : బ్యాంకుల నుంచి వస్తున్న నోటీసులు వెంటనే ఆపాలని, ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఇచ్చిన రుణమాఫీ హామీని వెంటనే అమలు చేయాలని టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి బి.అరుణ డిమాండ్ చేశారు. టిడ్కో కాలనీలోని సి96 బ్లాక్ వద్ద లబ్ధిదాలతో కలిసి ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలో మౌలిక వసతులను కల్పించాలన్నారు. ప్రతి బ్లాక్ వద్ద ఉప్పునీటి బోరును వేయాలన్నారు. ట్యాంకర్‌ల ద్వారా నీటిసరఫరా చేయడంతో పైఅంతస్తుల వాళ్లు నీళ్ళను ఎలా తీసుకువెళతారని ప్రశ్నించారు. కాలనీలో వెంటనే కల్యాణమండపాన్ని నిర్మించాలని, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కమిటీ అధ్యక్షులు రంగులరంగమ్మ, ఉపాధ్యక్షురాలు దుర్గ, సహాయ కార్యదర్శి గౌస్ సయ్యద్, నూరున్నీసా, కమిటీ సభ్యులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

టిడ్కో రుణ మాఫీపై త్వరలో ప్రకటన : వెనిగండ్ల

గుడివాడ, జూన్ 30 : త్వరలో టిడ్కో రుణమాఫీపై ప్రకటన వస్తుందని, తాగునీరు డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. టిడ్కో కాలనీలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుతో కలిసి పర్యటించారు. టిడ్కో కార్యాలయంలో టిడ్కో, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించి నిర్లక్ష్యానికి తావు లేకుండా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను సూచించారు. బ్యాంకు వాళ్లు ఇళ్ళను ఖాళీ చేయకుండా చూసుకునే బాధ్యత తనదని పేర్కొన్నారు. టిడ్కో కాలనీలోని మురుగునీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మున్సిపల్ కమీషనర్ బాలసుబ్రహ్మణ్యం, టిడ్కో ఎస్.ఇ చిన్నోడు, మున్సిపల్ ఎంఈ విజయదుర్గ, డీఈ ప్రవీణ్, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజావేదికలో కూటమి విజయోత్సవం



గుడివాడ : ప్రజావేదికలో కూటమి విజయోత్సవం టీడీపీ ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్‌ను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావులు కట్ చేసి పంపిణీ చేశారు. కొడాలి రామరాజు, వాసే మురళీ, కంచర్ల సుధాకర్, పులవర్తి డేవిడ్‌బాబు, వద్దాది నాగరాజు, భవాని, కనకాంబరం, చాట్రగడ్డ రవి, కర్రే గిరి, గడ్డం ప్రకాష్‌దాసు, మద్దాలి ఇస్సాకు, రేమల్లి రజనీకాంత్, దాసు శ్యామ్, బుల్లా కింగ్, వేశపోగు సుందరయ్య, ఇమ్మానియేలు, సాల్మన్‌రాజు, సాలి నవీన్, కొదమల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బట్టు మెమోరియల్ ప్రతిభా పురస్కారాల ప్రదానం నేడు

గుడివాడ : బట్టు వెంకటరత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఐఎంఏ హాల్‌లో ఉదయం 10 గంటలకు పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బట్టు మనోరంజితం మెమోరియల్ ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్నట్లు ట్రస్ట్ ఛైర్మన్ బట్టు పద్మకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా మంత్రి కొల్లు రవీంద్ర, ఆత్మీయ అతిథిగా మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి బట్టు దేవానంద్, గౌరవ అతిథిగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ట్రస్ట్ సభ్యులు బట్టు ప్రసన్నకుమారి, బట్టు ప్రశాంతి, బట్టు విజయలక్ష్మీ, గుత్తికొండ శ్రీరాజబాబు, గంటా రమేష్ మనోహర్, పెద్దబోయిన వెంకట సత్యనారాయణ, జక్కుల విజయశేఖర్ కోరారు.

గుడ్లవల్లేరు లయన్స్ నూతన కార్యవర్గం



గుడ్లవల్లేరు : లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షురాలిగా నిమ్మగడ్డ శశికళ, కార్యదర్శిగా మేరుగు పెరుమాళ్ళు, కోశాధికారిగా కళ్యాణపు నవాబు, ఉపాధ్యక్షులుగా దేవిశెట్టి రామకృష్ణ, మత్తి శ్రీరామమూర్తి, మెంబర్‌షిప్ ఛైర్‌పర్సన్‌గా మూల్పూరి సుధాకర్, ఎల్‌సీఎఫ్ కో-ఆర్డినేటర్‌గా సిహెచ్ గాంధీ ప్రసాద్, క్లబ్ సర్వీసెస్ ఛైర్‌పర్సన్‌గా పెంటపాటి చిట్టిబాబు, క్లబ్ మార్కెటింగ్ ఛైర్‌పర్సన్‌గా చలసాని శ్రీధర్ , 25 మంది డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం 2వ తేదీ మంగళవారం లయన్స్ సేవా భవనల్లో జరుగుంది.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : కాగిత



పెడన రూరల్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు. దావోజిపాలెంలోని అమలేశ్వరి యువశక్తి ఆధ్వర్యంలో కృష్ణప్రసాద్ మొక్కలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి మొక్కలు పంపిణీ చేస్తామని యువకులు తెలిపారు. నందిగం పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, ఎంఈవో హరినాథ్, అంకెం మురళీధర్, అమలేశ్వరి యూత్ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయం వార్షికోత్సవం

చల్లపల్లి : చల్లపల్లిలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయం ఆరవ వార్షికోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు అయ్యప్ప స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. గ్రామోత్సవం కన్నులపండువగా ప్రారంభమైంది. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. సోమవారం అన్నసమారాధన జరుగుతుందన్నారు.

కమ్యూనిస్టులతోనే పౌరహక్కుల పరిరక్షణ

• మేకా సీతారామయ్య శత జయంతి సభలో సీపీఐ నేత గుజ్జుల ఈశ్వరయ్య



మేకా సీతారామయ్య శతజయంతి సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర నాయకులు గుజ్జుల ఈశ్వరయ్య

చల్లపల్లి, జూన్ 30 : కమ్యూనిస్టు పార్టీలు బలహీనపడితే పౌర హక్కులకు భంగం కలిగే ప్రమాదం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు మేకా సీతారామయ్య శతజయంతి సభ స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈశ్వరయ్య మాట్లాడుతూ, కమ్యూనిస్టులు మరణించినా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా జీవించే ఉంటారని పేర్కొన్నారు. ఎల్లప్పుడూ పేద ప్రజల పక్షాన నిలబడి పోరాడేది కమ్యూనిస్టులేననీ, అలాంటి కోవకు చెందినవారిలో మేకా సీతారామయ్య ఒకరన్నారు. కమ్యూనిస్టు పార్టీ అగ్రనేత కామ్రేడ్ చండ్ర రాజేశ్వరరావు, ఎందరో నాయకులు ఉవ్వెత్తున కొనసాగించిన ఎర్రజెండా ఉద్యమాల వారసులు మేకా సీతారామయ్య అని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు కమ్యూనిస్టు పార్టీలను ఆదరించి చట్ట సభలకు పంపాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ సీనియర్ నాయకులు మాలెంపాటి కాంచనరావు అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య, రాష్ట్ర నాయకులు నార్ల వెంకటేశ్వరరావు, వెలగపూడి ఆజాద్, రైతునాయకులు చంద్రప్రసాద్, ప్రజా నాట్యమండలి నేత ఆర్.పిచ్చియ్య, విశాఖ కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ చిన్నం కోటేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, చెరుకు శ్రీనివాసరావు, పైడిపాముల గురుప్రసాద్, సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ మేకా రమేష్, మల్లుపెద్ది రత్నకుమారి, హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, గుత్తికొండ రామారావు, సీతారామయ్య కుమారులు మేకా నరసింహారావు, మేకా రామారావు ప్రసంగించారు. తొలుత మేకా వారిపాలెంలోని స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించి సభా ప్రాంగణం వద్దకు చేరుకున్నారు.



అంబేద్కర్ భవన్‌ను పరిశీలిస్తున్న మంత్రి రవీంద్ర

బహుళ ప్రయోజనకరంగా అంబేద్కర్ భవన్

మచిలీపట్నం టౌన్ : అంబేద్కర్ భవనం పేదలకు ఉపయోగపడేలా మల్టీ పర్పస్ హాల్‌గా తీర్చిదిద్ది, గ్రంథాలయం, స్టడీ సర్కిల్, పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేస్తామ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణతో కలసి కొల్లు రవీంద్ర ఆదివారం అంబేద్కర్ భవన్‌ను సందర్శించారు మునిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గోపు సత్యనారాయణ, మాదివాడ రాము, గుమ్మడి విద్యాసాగర్, చిన్నం సురేష్, పి.వి. ఫణికుమార్, ఎస్సీ కార్పొరేషన్ డిడి షాహిద్‌బాబు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం సుమతి కుమారికి సన్మానం



చల్లపల్లి (నిమ్మగడ్డ) : నిమ్మగడ్డ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కైలా సుమతి కుమారి పదవీ విరమణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఎంఈవో-2 పరిశె వెంకటేశ్వరరావు హెచ్‌ఎం సుమతి కుమారి - చెరుకూరి రాఘవులు దంపతులను సత్కరించారు. పురిటిగడ్డ జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కెబిఎన్.శర్మ, ఎస్ఎంసీ ఛైర్మన్ పి.ప్రశాంతి, పాస్టర్ ఎస్.సంగీతరావు, ఉపాధ్యాయుడు బి.చినకేశరావు, గ్రామపెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న మానవత సేవా సంస్థ కార్యవర్గం

సేవా దృక్పథంతో మానవత విలువలు పెంపొందించుకోవాలి

మచిలీపట్నం టౌన్, జూన్ 30 : సేవా దృక్పథంతో మానవత విలువలు పెంపొందించుకోవాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ స్టేట్ కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. మచిలీపట్నం పరాసుపేటలో ఆదివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. అధ్యక్షుడుగా స్టార్ కళాశాల అధినేత శ్రీరామ్, ఉపాధ్యక్షుడుగా కె. రాజేంద్రప్రసాద్, కార్యదర్శిగా కానుకొలను ఫణికిరణ్, కోశాధికారిగా పి.వి.ఎస్.ఆర్. ప్రసాదరావు, సంయుక్త కార్యదర్శిగా కాపవరపు చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులుగా బృందావనం నారాయణభట్టు, అప్పినీడి పోతురాజు, డాక్టర్ మల్లిఖార్జునుడు, బత్తిన వెంకటరమణ, బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ ఛైర్మన్‌గా గొర్రెపాటి గోపీచంద్, కన్వీనర్‌గా అంబటి అశోక్‌కుమార్, డైరెక్టర్లుగా రాసంశెట్టి వాణి, మన్నెం సాంబశివరావు, పి.వి. ఫణికుమార్, మద్దాల చింతయ్య, పి. సాయికృష్ణప్రసాద్, ఉల్లి రంగారావు ప్రమాణ స్వీకారం చేశారు. అడ్వయిజరీ బోర్డులో డాక్టర్ బి. ధన్వంతరీ ఆచార్య, లంకిశెట్టి బాలాజీ, శ్రీనివాసాచార్య, బచ్చుల బోసుబాబు, పి. భార్గవ్, హసీంబేగ్, శాయన సుశీల్‌రావు బాధ్యతల స్వీకరించారు. ఆర్‌కె సంస్థల అధినేత బండి రామకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ , శీతల ప్రసాద్, తలశిల దామోదర్, మట్టా రాధాకృష్ణమూర్తి, కాగిత సాంబశివరావు, ఆలపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని గాయాలు

మోపిదేవి : కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనటంతో మధుబాబు అనే వ్యక్తి గాయపడ్డాడు. నర్సాపురానికి చెందిన రెండు కుటుంబాలు మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దర్శనం అనంతరం కారులో తిరిగి బయలుదేరి వెళ్తున్నారు. రేపల్లెకు చెందిన మధుబాబు అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై చల్లపల్లి వైపు వస్తుండగా ప్రశాంత్ నగర్ వద్ద ఇరు వాహనాలు ఢీకొన్నారు. ద్విచక్ర వాహనదారులు తీవ్ర గాయాలపాలయ్యాడు.

అగ్నిబాధిత కుటుంబానికి విక్కుర్తి సాయం

అవనిగడ్డ : కొత్తపేటలోని అగ్నిబాధిత వినయ్ కుమార్ కుటుంబానికి విక్కుర్తి వీరరాఘవయ్య ట్రస్ట్ ఆర్థిక సాయమందించింది. ట్రస్ట్ ఛైర్మన్ విక్కుర్తి శ్రీనివాస్ పేరిట ఆయన సోదరుడు రాంబాబు రూ.5 వేల నగదు, బియ్యం, నిత్యావసరాలను అందజేశారు. భూపతి నాంచారయ్య, పులిగడ్డ చంద్ర, బర్మా శ్రీను, వర్రే బస్వారావు, పున్నయ్య చౌదరి, బర్మా బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాగిత పర్యటన నేడు

పెడన : పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సోమవారం ఉదయం 5 గంటలకు బంటుమిల్లి మండలం నాగేశ్వరరావుపేట గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. 7.30 గంటలకు పెడన మండలం బల్లిపర్రు గ్రామంలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. 8 గంటలకు పెడన మునిసిపాలిటీలోని తొమ్మిదో వార్డులో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. 9.30 గంటలకు గూడూరు మండలం పోసినవారిపాలెం గ్రామంలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో, 10.30 గంటలకు కృత్తివెన్ను గ్రామంలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయం తెలిపింది.

సాగరతీరంలో సందర్శకుల సందడి

కోడూరు : హంసలదీవి సాగర తీరం సందర్శకులతో కళకళలాడింది. కుటుంబ సమేతంగా సందర్శకులు విచ్చేసి స్నానాలు ఆచరించి హంసలదీవి రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు. సముద్రతీరం వెంబడి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మెరైన్ పోలీసు సిబ్బంది గస్తీ నిర్వహించారు.

రామచంద్రపురంలో శ్రీహరిరావు వర్ధంతి



అవనిగడ్డ రూరల్ : కమ్యూనిస్టు ఉద్యమ నేత మోదుమూడి శ్రీహరిరావు 25వ వర్ధంతి రామచంద్రపురంలో ఆదివారం జరిగింది. డాక్టర్ కుప్పా రామస్వామిశాస్త్రి చేతుల మీదుగా పదవ తరగతి, ఇంటర్‌లో మొదటి, రెండు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.6 వేలు, రూ.3 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని శ్రీహరిరావు కుటుంబ సభ్యులు అందజేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయానికి మోదుమూడి శ్రీహరిరావు పేరిట నాలుగు సిమెంటు బల్లలను అందజేశారు. సర్పంచి వాకా నాగ రమేష్, ఉప సర్పంచి బచ్చు ఆంజనేయులు, శ్రీహరిరావు కుటుంబసభ్యులు యల్లాప్రగడ రవికుమార్, మోదుమూడి, మురళీకృష్ణ, దాలిపర్తి కృష్ణమూర్తి, నెల బాలుడు, ఎం.చెన్నకేశవరావు పాల్గొన్నారు.

అగ్నిబాధిత కుటుంబానికి రెడ్‌క్రాస్ సాయం

చల్లపల్లి : నారాయణరావునగర్ కాలనీ అగ్నిబాధిత గరికపాటి యశోద కుటుంబానికి ఇం డియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చల్లపల్లి సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో సహాయం చేశారు. తహసీల్దార్ బి.సుమతి ఆదేశాలతో ఆర్‌ఐ ఘంటసాల కృష్ణమోహన్, రెడ్‌క్రాస్ సబ్ బ్రాంచ్ అధ్యక్షుడు నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, ఉపాధ్యక్షుడు పేరం మధుసూధనరెడ్డి, కోశాధికారి ఎండి. ఎకె.జిలానీ, సభ్యులు ఆకురాతి హరిప్రసాద్, బళ్లా మధుసూధనరావు బాధితులకు రెడ్‌క్రాస్ కిట్, టార్పాలిన్, బియ్యం అందజేశారు.

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు

చల్లపల్లి: చల్లపల్లి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర పరీక్షా శిబిరం నిర్వహించారు. డాక్టర్ మోహనరావు 100 మందిని పరీక్షించి 30 మందిని ఐఓఎల్ శస్త్రచికిత్సలకు ఎంపికచేశారు. హోమియో శిబిరంలో డాక్టర్ తమ్మన సాయి మణికంఠ 80 మందిని పరీక్షించి, ఉచితంగా మందులు అందించారు. బీజేపీ నేత మంచికంటి కిరణ్, వాసవీక్లబ్ ప్రతినిధులు గోళ్ల ద్రోణ పూర్ణచంద్రరావు, దింటకుర్తి జ్యోతి, అమరవాణి, మలిశెట్టి చెంచురాములు, అద్దేపల్లి సాయికుమారి, నంబూరి కుసుమ తదితరులు సేవలు అందించారు.